
సురక్షితమేనా?



పెద్దసీదిలోని వాటర్ ట్యాంకు

- అపరిశుభ్రంగా రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు
- క్లోరినేషన్ ఊసెత్తని అధికారులు
- కలుషిత నీరే గతి
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



పాతపట్నంలో ఉన్న వాటర్ ట్యాంకు దుస్థితి..

పాతపట్నం: ప్రజలకు రక్షిత నీరు అందడం లేదు. పరిశుభ్రమైన తాగునీరు అందించడలంలో గ్రామీణ మంచి నీటిసరఫరా విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ట్యాంకుల శుభ్రత తమ బాధ్యత కాదన్నట్లు అటు ఆర్‌డబ్ల్యూస్ అధికారులు, ఇటు పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత మాట అటుంచితే కనీసం బ్లీచింగ్ కలిపిన నీటిని అయినా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కలుషిత నీరు వల్ల వ్యాధుల ప్రబలే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో బోర్లు, వాటర్ ట్యాంకుల వివరాలు

మండలం	పంచాయతీలు	గ్రామాలు	బోర్లు	వాటర్ ట్యాంకులు
పాతపట్నం	34	118	309	49
మెళియాపుట్టి	37	164	370	55
హిరమండలం	24	86	246	31
కొత్తూరు	43	138	507	31
ఎల్.ఎన్.పేట	22	63	257	11

అప్పుడే పైపులైన్లకు పట్టిన నాచు వదులుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీలకు క్లోరినేషన్ కిట్లను అందజేయలేదని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ట్యాంకుల పరిశుభ్రతను పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామీణ ప్రజలకు ఉదయం, సాయంత్రం అందించే తాగునీరు వల్ల కలుషిత కావడం వలన అంటు వ్యాధులు, విష జ్వారాలు, గొంతునొప్పి బారిన పడుతున్నారు.

కొరవడిన నిర్వహణ

నెల రోజుల్లో రెండు సార్లు ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి. నెలకు ఒకసారి ట్యాంకులను కడిగి రోజంతా ఎండతగిలేలా జాగ్రత్తలు తీసుకోవాలి. బాగా బ్లీచింగ్ కలిపిన నీటిని పైపులైన్ ద్వారా అన్ని ట్యాప్‌ల నుంచి ప్రవహించేలా చర్యలు చేపట్టాలి.

చర్యలు తీసుకోవాలి



రక్షిత మంచినీటి పథకాలను శుభ్రపర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మా గ్రామంలో ఇంత వరకు శుభ్రం చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.నారాయణరావు, పెద్ద సీది, పాతపట్నం

శుభ్రం చేసి చాలా రోజులైంది



తమ గ్రామంలో రోజూ కలుషిత నీరే వస్తోంది. ట్యాంకులు శుభ్రంచేసి చాలా రోజులవుతోంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఈ రోజు, రేపు అంటున్నారు. ఈ కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

– బి.నారాయణమూర్తి, దుర్గమ్మగుడి కాలనీ, పాతపట్నం

క్లోరినేషన్ బాధ్యత పంచాయతీలదే..



వాటర్ ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదే. పంచాయతీ కార్యదర్శులు ట్యాంకులు క్లోరినేషన్ చేసేనప్పుడు పీఆర్–1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పైపుల ద్వారా పంపిణీ చేస్తున్న తాగునీరు ప్రతీరోజు తప్పకుండా క్లోరినేషన్ చేయాలి.

– సి.హెచ్.వి.అప్పలనాయుడు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పాతపట్నం

క్లుప్తంగా

భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం



నిర్మాణ దశలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం

సారవకోట: మండలంలోని కోదడ్డపనస స్వయం భూ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం భక్తుల విరాళాలతో పనులు జరుగుతున్నాయి. ఇక్కడి విగ్రహం కొండ మీద ఉన్న పుట్టలో దొరకడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారు. దాతలు ఇచ్చిన విరాళాలతో కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణాన్ని శబరిమలలో ఉన్న నమూనాను ఆధారంగా తీసుకుని చేపడుతున్నారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు 70 శాతం పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగాలకు 101 మంది ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన యువతీ, యువకులు

నరసన్నపేట: స్థానిక ప్రిజం డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 101 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 280 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 18 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అమేజాన్, రిలయన్స్, పేటీఎం, నవత, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, మెడిప్లెస్ తదితర కంపెనీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందించినట్లు ప్రిజం డిగ్రీ కళాశాల ప్రతినిధి శ్రీనివాసరావు తెలిపారు. పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టిని సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బూర్జ: రైతులు తమ పొలంలో ఏయే పోషకాలు ఎంత ఉన్నాయో మట్టి నమూనాల ద్వారా తెలుసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని పి.రామన్నపేటలో వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో 997 మట్టి నమూనాలను చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తగిన మోతాదులో ఎరువులు వాడితే నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు హేమ, ఇంద్రజ, వసంత, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ కండక్టర్ మృతి



తిరుపతిరావు (ఫైల్)

ఆమదాలవలస: మున్సిపాల్టీలోని 20వ వార్డు వెంగళరావు కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ తంజెళ్ల తిరుపతిరావు (62) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన ప్రకారం.. ఈ నెల 15వ తేదీన తిరుపతిరావు తన ద్విచక్ర వాహనంపై మార్కెట్ నుంచి ఇంటికి వస్తున్నారు. ఆమదాలవలస ఫ్లై ఓవర్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. ట్రాక్టర్ వెనుక వైపు బైక్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తిరుపతిరావును స్థానికులు రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడు తిరుపతిరావుకు భార్య కాంతమ్మ, కుమారుడు ఉన్నారు.

విచారణ..



కొసమాలలో పర్యటించిన డీఎల్‌పీఓ గోపీబాల, అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామాన్ని డీఎల్‌పీఓ గోపీబాల శనివారం సందర్శించారు. ఈ గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నిధులు పక్కదారిపట్టినట్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సర్పంచ్ ఉర్లాన రవి, గ్రామానికి చెందిన పలువురు ఇటీవల ఫిర్యాదు చేశారు. గ్రామంలోని రహదారులు, కాలువల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలు, తదితర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీటిపై గ్రామంలో విచారణ చేపట్టారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తమ్మినేనికి అభినందనలు



సీతారాంను అభినందిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ రాజకీయ సలహా కమిటీ సభ్యుడిగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను పార్టీ అధిష్టానం ఇటీవల నియమించింది. ఆయనను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, నాయకులు, కార్యకర్తలంతా శనివారం ఆమదాలవలస చేరుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని, దీనికి ఇటీవల బూర్జ మండలంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై ఓ మహిళ ఎదురుతిరిగి ప్రశ్నించిన సంఘటనే నిదర్శనమన్నారు. ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ డి.వెంకటరావు, నాయకులు అన్నెపు రామారావు, ఎస్.హేమసుందర్‌రాజు, బి.దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామయ్య సంబరం



చిన్నారుల కోలాట ప్రదర్శన

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన వారు రామయ్య సంబరాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గ్రామంలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో గ్రామానికి చెందిన శ్రీకోటదుర్గ ఇంద్రాణి కోలాటం గ్రూప్ చిన్నారులు భక్తి పాటలకు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

రూ. 20 వేల ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు

పొందూరు: ఈ నెల 21న సాక్షిలో ప్రచురించిన 'దేవుడి మీదే భారం' అనే శీర్షికకు ఎచ్చెర్ల మండలం 'మన కుటుంబం వాట్సాప్' సభ్యులు స్పందించారు. పొందూరు మండలం మలకాం గ్రామానికి చెందిన శివాలయం పూజారి తన తలకు ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతలను సహాయం చేయాలని కోరారు. ఈ మేరకు రూ.20 వేలు నగదును పూజారి విబూది నీలకంఠంకు వాట్సాప్ కుటుంబ సభ్యులు శనివారం అందజేశారు. వాట్సాప్ అడ్మిన్ కొత్తకోట శ్రీనివాసరావు, ఏయూ విశ్రాంతి ప్రొఫెసర్ చౌదరి అప్పారావు, ఎస్ఐ చౌదరి అప్పారావు, గురుగుబెల్లి హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

ధ్రువపత్రాల పంపిణీ



విద్యార్థులతో ఎంఈఓ, హెచ్‌ఎం

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు బుధవారం వృత్తి విద్యా ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలను ఎంఈఓ–2 పట్నాన రాజారావు, హెచ్‌ఎం వెంకటరావు శనివారం అందజేశారు.

విద్యార్థులకు పది రోజులపాటు ఐటీ కోర్సులో శిక్షణ ఇవ్వడం జరిగిందని హెచ్‌ఎం తెలిపారు. ఐసీపీ ఒకేషనల్ కోఆర్డినేటర్‌లు శంకరరావు, తిరుపతిరావు, ట్రైనర్ బి.సుధారాణి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు టెన్త్ పాసైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.హేమసుందర్‌రావు శనివారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులకు అడ్మిషన్లు చేపడుతన్నట్లు తెలిపారు. నిర్ధేశిత ఫీజు, హాల్ టికెట్, ఆధార్‌కార్డులతో హాజరై ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉగ్రదాడి దారుణం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆమదాలవలస: కశ్మీర్‌లో ఉగ్రవాది దాడి దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. స్థానిక టీఎస్సార్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు కొవ్వొత్తుల వెలిగించి నిరసన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే కప్ టి 20 టోర్నమెంట్ నిర్వాహకులు, క్రికెటర్లు ఉగ్రదాడిలో అశువుల బాసిన మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న రామరాజు, తదితరులు

పాతపట్నం: పదో తరగతి ఫలితాల్లో పాతపట్నం నియోజకవర్గంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు స్థానిక శాఖ గ్రంథాలయంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. విశ్రాంత ఎంపీడీఓ సలాన చిరంజీవి, మహేంద్ర కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబులు, ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు, శాఖా గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లాస్య

ఆమదాలవలస రూరల్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని జెమ్స్ ఆస్పత్రి వైద్యురాలు కె.లాస్య అన్నారు. ఆమదాలవలస మండలంలోని శ్రీహరిపురంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు పి.జనార్దనరావు, టెక్నీషియన్ ప్రేమ, ఫార్మసిస్టు డి.విజయ, పీఆర్ఓ త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఉపసంచాలకులు డాక్టర్ జయరాజ్

పాతపట్నం: వేసవి కాలంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి పశుసంవర్ధకశాఖ టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా శనివారం పాతపట్నం కోర్టు కూడలిలో ఉన్న పశువైద్యశాఖ ఏడీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పశు వైద్యుల సూచనలు, సలహాలతో పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. జాతీయ స్థూల ఉత్పత్తి పెరగడానికి పశు సంవర్ధకశాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. పాతపట్నం, కోటబొమ్మాళి ఏడీలు ఎం.కరుణాకరరావు, లోకనాథం, శిర్ల జోగారావు, ఎంపీటీసీ కొండాల యరకయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతి పట్నాయక్, ఈఓపీఆర్డీ వెంకటరావు, వైద్యులు శ్రీవాణి, అనిల్‌కుమార్, మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖలపై సభ్యుల ధ్వజం

కొత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల పనితీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. కర్లెమ్మ గ్రామంలో రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని ఏడాది క్రితం నుంచి దరఖాస్తులు ఇస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని సీడీపీఓ దృష్టికి వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు తీసుకువచ్చారు. గిరిజనలకు రేషన్ పంపిణీలో జాప్యం జరుగుతుందని అధికారులకు ఎంపీపీ ఫిర్యాదు చేశారు. పలు శాఖల పనితీరుపై చర్చించారు.

మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బర్రి హరిణికి 591 మార్కులు రావడంతో సభ్యులు అభినందిచారు. ఇన్‌చార్జి తహసీల్దార్ నారాయణరావు, ఏఓ స్వర్ణలత, జేఈఈ దుర్గాప్రసాద్, ఏపీఓ ప్రేమలత, ఏపీఎం లలిత, ఏఈఓ గోవిందరావు, కురిగాం వైద్యాధికారి పెద్దిన ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి పేరుతో సరికొత్త మోసం



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: సంపద సృష్టిస్తానని ప్రజలను నమ్మిస్తూ సరికొత్త మోసాన్ని ముఖ్యమంత్రిగా చంద్రబాబు తెరమీదకు తీసుకువచ్చారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో మత్స్యకారులతో జరిగిన సమావేశం సందర్భంగా సముద్రం నుంచి సంపద సృష్టిస్తామని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు మాటలు వింటుంటే సముద్రంలోని ఇసుకను కూడా విక్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు అనిపిస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. పాతపట్నం నియోజకవర్గంలో ఎన్నికల ముందు చంద్రబాబు చేసిన పర్యటనలో.. ఐటీడీఏ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, అగ్నిమాపక కేంద్రం, వంద పడకల అస్పత్రి, విద్య, ఉపాధి అవకాశాల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటు వంటి అనేక హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలకు అవుతున్నా హామీలు ఎందుకు అమలు చేయటం లేదన్నారు.

ఏబీహెచ్‌బీ కాలనీలో ఆందోళన



మద్యం దుకాణంలో కూర్చోని ఆందోళన చేస్తున్న మహిళలు, కాలనీ వాసులు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఏబీహెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద కాలనీ వాసులు, మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు దుక్క శ్రీకాంత్, సలాన చిరంజీవి, రేగేటి ఆనందరావు, గేదెల రామారావు, మహిళలు మాట్లాడుతూ.. జనావాసాల మధ్య మద్యం దుకాణం నిర్వహించడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జనావాసాలకు దూరంగా తరలించాలన్నారు. ధర్నా విషయం తెలుకున్న ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసులు అక్కడకు చేరుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే గోవిందరావు చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు అనుమతులు ఇవ్వడం వల్లే తమకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కాలనీలో మద్యం దుకాణం తొలగించకపోతే ఆందోళనలు ఉధృతం చేపడతామని హెచ్చరించారు.

వడదెబ్బపై అప్రమత్తం



ఉపాధి వేతనదారులకు సూచనలిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నరసన్నపేట: ఎండ తీవ్రత రోజురోజుకీ పెరుగుతోందని, దీనికి తోడు ఉక్క పోత అధికం అవుతోందని, వడదెబ్బపై వేతనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉర్లాం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ గణపతిరావు సూచించారు. మండలంలోని కొల్లవానిపేటలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధి వేతనదారులకు శనివారం పలు సూచనలు చేశారు. పనికి వెళ్తున్నప్పుడు విధిగా మంచి నీరు తీసుకువెళ్లాలన్నారు. అలసట అనిపిస్తే వెంటనే నీడ ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలని సూచించారు. 11 గంటల దాటిన తరువాత పనులు చేయవద్దని, ఎండలో తిరగవద్దన్నారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జీవీ రమణ, హెల్త్ అసిస్టెంట్ కూర్మారావు, తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ హామీ నెరవేరేదెప్పుడు?



సమావేశంలో మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఎప్పుడు ఏర్పాటు చేస్తారని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ ప్రశ్నించారు. శనివారం మెళియాపుట్టిలోని ఓ కల్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెళియాపుట్టి మండలంలో అత్యధిక గిరిజనులు నివాసముంటున్నారనీ.. ఇక్కడ ఐటీడీఏ ఏర్పాటు వల్ల గిరిజన గ్రామాల యువత ఉద్యోగాలు పొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఏమయ్యారని, మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ.1500, రైతులకు రూ.20000, నిరుద్యోగులకు భృతి తదితర హామీలు ఎప్పుడు నెరవేర్చుతారనీ ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాడి అప్పారావు, లింగాల సంజీవరావు, సర్పంచ్‌లు గణపతి ప్రధాన్, చంద్రరావు, నాయకులు జె.కన్నబాబు, గండేటి చిన్నారావు, సలాన సత్యం, నక్కల కిరణ్, పరపటి యోగీశ్వరరావు, యు.రుషి, మాడుగుల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.